క్లుప్తంగా

మిత్రుడి కుటుంబానికి చేయూత

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తికి చెందిన లింగనబోయిన రాంబాబు ఇటీవల మృతి చెందగా రాంబాబుతో కలిసి చదువుకున్న రఘునాథపాలెం జెడ్పీఎస్ఎస్ పూర్వ విద్యార్థులు ఆదివారం చేయూత అందించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.40 వేలు ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తమ్మిన్ని నాగేశ్వరరావు, మిత్రబృందం వెంకటరావు, నరేందర్, గోపయ్య, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 4వ డివిజన్ కైకొండాయిగూడెం క్రాస్‌రోడ్డులోని శ్రీఅంకమ్మ, మహాలక్ష్మమ్మ, మద్దిరావమ్మ దేవాలయ పునర్నిర్మాణానికి పలువురు భక్తులు ఆదివారం విరాళాలు అందించినట్లు దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. నగరానికి చెందిన కాటేపల్లి రమేష్‌బాబు, విద్యారాణి రూ.25 వేలు, ఆరేపల్లి సత్యనారాయణ, నాగసరళ రూ.10 వేలు, వట్టం వార్ నారాయణ, ఉమారాణి రూ10 వేలు, బోడేపుడి శివరాం, దివ్యసాయి రూ.10 వేలు, కేళోత్ మోతీలాల్ రూ.2 వేలు అందించినట్లు తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర ఆలయంలో ఆరాధన మహోత్సవం

ఖమ్మంఅర్బన్: నగరంలోని 2వ డివిజన్ పాండురంగాపురంలో శ్రీశ్రీశ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో ఆదివారం ఆరాధనా మహోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయంలో భక్తులు ప్రత్యేక వ్రత పూజలు, అభిషేక పూజలు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ అధ్యక్షుడు చీమకుర్తి బ్రహ్మాచారి, ప్రధాన కార్యదర్శి నర్సింగోజు కృష్ణమాచారి, కోశాధికారి పుల్లి కిరణ్‌కుమార్‌చారి, గౌరవాధ్యక్షుడు అన్నవరపు పుల్లాచారి, దిగోజు భిక్షమయ్యచారి పాల్గొన్నారు.

డీఈఓ ఆదేశాలు సరికావు

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో వేసవి సెలవుల్లో టీచర్లు పాఠశాలలకు హాజరుకావాలని డీఈఓ ఆదేశాలు జారీ చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మోత్కూరి మధు, ఆర్.రంగరావులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతీ పది రోజులకొకసారి ప్రగతి నివేదికలు ఇవ్వాలని కోరటాన్ని ఖండిస్తున్నామని, తక్షణమే ఆదేశాలు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఉపాధ్యాయుల శ్రమదోపిడీని ఆపాలి

కేజీబీవీ ఉపాధ్యాయుల శ్రమ దోపిడీని ఆపాలని టీపీటీఎఫ్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి రోజు పాఠశాలకు హాజరుకావాలని, మే 31 వరకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని మౌఖిక ఆదేశాలు ఇవ్వటాన్ని తప్పుపట్టారు.

రెగ్యులర్ చేసే వరకు ఉద్యమం ఆగదు

నేలకొండపల్లి: జేపీఎస్, ఓపీఎస్‌లకు రెగ్యులర్ చేసే వరకు ఉద్యమం ఆగదని సంఘం జిల్లా నాయకులు బైరం దినేష్‌కుమార్ హెచ్చరించారు. మండలపరిషత్ కార్యాలయం వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... అసెంబ్లీ సాక్షిగా కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన తీవ్రతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు కె.రామారావు, నరేష్, కోటేశ్వరరావు, వీరబాబు, లింగరాజు, శ్రీనివాసరావు, మహేష్ పాల్గొన్నారు.

పువ్వాడకు శుభాకాంక్షలు తెలిపిన మేయర్



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: నూతన సచివాలయంలో మంత్రులకు ఏర్పాటు చేసిన చాంబర్‌లో కూర్చుని బాధ్యతలు స్వీకరించిన మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌కు ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

మెగా అవార్డులకు ఎంపికైన వారికి సన్మానం

తిరుమలాయపాలెం: మెగా అవార్డ్స్ 2023 ఆల్ టాలెంటెడ్ కేటగిరిల్లో ప్రతిభ కనబర్చిన మండలంలోని తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కళాకారుడు కొమ్ము రమేష్, బెస్ట్ సోషల్ అక్టివిస్ట్‌గా మట్టి దుర్గాప్రసాద్‌ని ఆదివారం హైదరాబాద్‌లో సన్మానించారు. అంబేడ్కర్ జయంతి ఉత్సవాల సందర్భంగా తెలంగాణ ఐడీసీ వేణుగోపాలచారి, మెగా రికార్డ్స్ అధినేత శ్రీనివాస్‌లు మెమెంటోలు అందజేసి సన్మానించారు.

అభివృద్ధిలో కీలకం.. అవస్థలు అధికం

20 రోజులుగా కొనసాగుతున్న వీఓఏల సమ్మె

- ప్రభుత్వంపై మండిపడుతున్న వైనం
- పేరుకుపోతున్న పనులు



వినతిపత్రం అందజేస్తున్న వీఓఏలు (ఫైల్)



ఆందోళన చేస్తున్న వీఓఏలు(ఫైల్)

నేలకొండపల్లి: తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఐకేపీ వీఓఏ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో వీఓఏలు సమ్మెలో చేస్తున్నారు. దీంతో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇబ్బందులు పడుతున్నారు. డివిజన్ వ్యాప్తంగా 280 మంది వీఓఏలు సమ్మెలో ఉన్నారు. సంఘాల సభ్యులు రుణాలు తీసుకోవటానికి, ఇతరత్రా పనులు జరగక క్షేత్ర స్థాయిలో పనులు పేరుకుపోతున్నాయి. ప్రతీ రోజు ఐకేపీ కార్యాలయం వరకు వచ్చి వెనుతిరుగుతున్నారు. ఐకేపీలో జరగాల్సిన సంఘం కార్యకలాపాలు పడకేస్తున్న పాలకులు పట్టించుకోవడం లేదని వీఓఏలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మహిళా సంఘాల బలోపేతంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. దాదాపు 30 ఏళ్ల నుంచి పనులు సాగిస్తున్నారు. డ్వాక్రా అనంతరం ఐకేపీ, సెర్ప్‌గా మారింది. ఇటీవలే ప్రభుత్వం సెర్ప్‌లో పని చేస్తున్న ఏపీఓ, సీసీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. కానీ క్షేత్ర స్థాయిలో పని చేసే వీఓఏలను మాత్రం పట్టించుకోకపోవటంతో సమ్మె బాట పట్టారు.

అరకొర వేతనమే..

రూ.3,900 వేతనంతో విధులు నిర్వహిస్తున్నారు. వీఓఏలు ముఖ్యంగా గ్రామాల్లో ప్రభుత్వం పథకాలను మహిళా సంఘాల తరుపున సంఘాలకు రుణాలు ఇప్పించడం, రికవరీ చేయడం, సామాజిక కార్యక్రమాలపై అవగాహన వంటి పనులు చేపడుతున్నారు. విధుల్లో అనుసంధాన కర్తగా ఉంటూ మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నారు. ఏళ్ల తరబడి చాలీచాలనీ వేతనాలతో పని చేస్తుండటంతో బతుకులు దుర్భరంగా మారాయి. ప్రభుత్వం పథకాల విజయవంతంలో కీలక పాత్ర పోషిస్తున్న తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని వీఓఏలు కోరుతున్నారు.

డిమాండ్‌లు ఇవీ..

- కనీస వేతనం రూ.18 వేలకు పెంచాలి
- వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి
- గుర్తింపు ఐడీ కార్డులు ఇవ్వాలి
- రూ.10 లక్షలు ఇన్సూరెన్స్ కల్పించాలి
- ఎస్‌హెచ్‌జీలకు పావలా వడ్డీ చెల్లించాలి
- అభయహస్తం డబ్బులు ఇవ్వాలి
- డ్రెస్ కోడ్ అమలు చేయాలి
- వ్యక్తిగత ఖాతాలోనే జీతం జమ చేయాలి

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి



ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వహిస్తున్న మమ్మల్ని ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి. మహిళా సంఘాల పని తీరులో క్షేత్ర స్థాయిలో ఉంటూ అన్నింటిని విజయవంతం చేస్తున్నాం. మా సమస్యలను వెంటనే పరిష్కరించాలి. ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలి.

– ఆర్.పార్వతిబాయి, వీఓఏ సంఘం జిల్లా నాయకురాలు, నేలకొండపల్లి

వేతనాలు పెంచాలి



చాలీ చాలనీ వేతనాలతో జీవనం కొనసాగిస్తున్నాం. ఇదే ఉద్యోగాలను నమ్ముకుని ఏళ్లగా పని చేస్తున్నాం. ప్రస్తుతం ధరలకు అనుగుణంగా రూ.18 వేలు వేతనాలు పెంచాల్సిన అవసరం ఉంది. ఉద్యోగ భద్రత కల్పించాలి. ప్రతీ నెలా వేతనాలు వీఓఏల వ్యక్తిగత ఖాతాలో జీతం జమ చేయాలి.

– బాజా వనజ, సంఘం నాయకురాలు, సింగారెడ్డిపాలెం

సమ్మెపై ప్రభుత్వం స్పందించాలి



సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించికపోవటం దారుణం. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి సంఘాల బలోపేతంలో శక్తి వంచన లేకుండా పని చేస్తున్న మాపై ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు బాధాకరం. ప్రభుత్వం వెంటనే స్పందించి న్యాయం చేయాలి.

– బందెల రూప, వీఓఏ, అనాసాగారం

ప్రతిష్ఠ మహోత్సవంలో పొంగులేటి



పూజలు చేస్తున్న పొంగులేటి శ్రీనివాసరెడ్డి

తిరుమలాయపాలెం: మండలంలోని బచ్చోడు గ్రామంలో పెద్దమ్మ తల్లి గుడి ప్రతిష్ఠ మహోత్సవంలో ఆదివారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ నిర్వాహకులు పొంగులేటి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మద్దినేని బేబి స్వర్ణకుమారి, శివరామకృష్ణ, అజ్మీరా అశోక్ నాయక్, సుదగాని ఉపేందర్, తిప్పిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, వెంకటేష్ యాదవ్, రమేష్, బాణోత్ లక్ష్మణ్, మహేష్, ప్రవీణ్, కృష్ణ పాల్గొన్నారు.

నేడు మైనింగ్ ఏడీ కార్యాలయం ముట్టడి

ఖమ్మం మామిళ్లగూడెం: ఇసుక మాఫీయాను కట్టడి చేయకపోతే ప్రజల తరుపున తాము పోరాటం చేస్తామని బీజేపీ రాష్ట్ర మహిళా నాయకురాలు ఉప్పల శారద అన్నారు. ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఇసుక మాఫీయాసొ సోమవారం మహిళా కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించే మైనింగ్ కార్యాలయ ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పమ్మి అనిత, నాయకులు ఆచంటి కోటేశ్వరరావు, సాయిరాం, శంకర్ గౌడ్ పాల్గొన్నారు.

మన్‌కీ బాత్‌తో ప్రజలకు చేరువ..



మన్‌కీబాత్ కార్యక్రమం వీక్షిస్తున్న నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: భారత దేశ చరిత్రలో ప్రధాని నరేంద్రమోదీ మన్‌కీ బాత్ ఒక చరిత్ర ఘట్టానికి నాంది పలికిందని, మన్‌కీబాత్‌తో మోదీ ప్రజలకు మరింత చేరువయ్యారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ అన్నారు. మోదీ మన్‌కీ బాత్ 100 ఎపిసోడ్ కార్యక్రమాన్ని ఆదివారం జిల్లా పార్టీ కార్యాలయ ప్రాంగణంలో పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఉప్పల శారద, గెంటెల విద్యాసాగర్, ఖమ్మం అసెంబ్లీ కన్వీనర్ అల్లిక అంజయ్య, రాష్ట్ర నాయకుడు జ్వాలా నర్సింహారావు, రాసేష్ గుప్త, అనిత, శంకర్ గౌడ్, డీకొండ శ్యామ్, ఆచంటి కోటేశ్వరావు, విక్రం జాదవ్, సాయిరాం, పసుమర్తి సతీష్ పాల్గొన్నారు.

బ్రాహ్మణ బజార్‌లో..

బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యంలో బ్రాహ్మణ బజారులో ప్రధాని మోదీ మన్‌కీబాత్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు మందా సరస్వతి, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

తిరుమలాయపాలెం: మండలంలోని రఘునాథపాలెంలో ఆదివారం నరేంద్రమోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తక్కెళ్లపల్లి నరేందర్‌రావు ఆధ్వర్యంలో టీవి ద్వారా ప్రజలకు చూపించారు. నాయకులు భద్రయ్య, పరమేష్, గురుమూర్తి, సాయి, కోంద్రు నగేష్ పాల్గొన్నారు.

షిర్డీ సాయి సచ్చరిత్రపై సమ్మేళనం

ఖమ్మంగాంధీచౌక్: షిర్డీ సాయి సచ్చరిత్ర, హారతులపై శాస్త్రీయ పరమైన విశ్లేషణ, అవగాహన కలిగించేందుకు అంతర్జాతీయ తెలుగు షిర్డీ సాయి భక్త సమ్మేళనాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వహణ కమిటీ ప్రతినిధి, ఖమ్మం శ్రీ కృష్ణ సాయి ఆశ్రమం చైర్మన్ లగడపాటి రామారావు తెలిపారు. ఆదివారం ఖమ్మం నగరంలోని ద్వారకామయి షిర్డీ సాయి సేవా ఆశ్రమంలో అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే భక్త సమ్మేళనంపై భక్తులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించే భక్త సమ్మేళనం కరపత్రాలను, బ్యానర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో లగడపాటి రామారావు, ద్వారకామయి షిర్డీ సాయి సేవా ఆశ్రమం అధ్యక్షుడు తుళ్లూరు మోహన్ రావు, కంచర్ల శివనాగమల్లేశ్వరరావు, జంగిలి నాగేశ్వరరావు, గోపి, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సంఘం బలోపేతానికి కృషిచేయాలి

ఖమ్మంఅర్బన్: బంజారాసేవాసంఘం బలోపేతానికి కృషి చేయాలని సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ లచ్చిరాంనాయక్ అన్నారు. ఆదివారం నగరంలోని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం బంజారా భవన్లో జరిగిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సబ్సిడీ పథకాలన్నీ అర్హులైన వారందరికి అందించే విధంగా సంఘం సభ్యులు కృషి చేయాలన్నారు. బస్కినాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దరావత్ రామ్మూర్తి నాయక్, జిల్లా అధ్యక్షుడు వర్కింగ్ ప్రెసిడెంట్ శివాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి బానోతు చంద్రం, నాయకులు మోతిలాల్, కోటేశ్వరరావు, అగ్గిరాం తేజావత్ పంతులు, రాజేష్, భూక్య రవి, అనిల్, హుసేన్, నరేష్, అనిత బాయ్, రఘునాయక్, అగ్గిరాం నాయక్, పర్మా నాయక్ పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనం

నేలకొండపల్లి: మండలంలోని బైరవునిపల్లి ప్రభుత్వ పాఠశాల 1996–97 సంవత్సరం పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో సందడి చేశారు. ఈ సందర్భంగా జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

ఖమ్మం సహకారనగర్: సీఎం కేసీఆర్ కాంట్రాక్టు ఉద్యోగుల రెగ్యులరైజేషన్ ఫైల్‌పై సంతకం చేయటంపై ఖమ్మం జిల్లా కాంట్రాక్ట్ అధ్యాపకులు సంఘం ఆధ్వర్యంలో నగరంలోని నయబజార్ జూనియర్ కళాశాలలో ఆదివారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కొండ వినోద్‌బాబు, కాంట్రాక్ట్ అధ్యాపకుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొప్పిసెట్టి సురేష్, సంఘం బాధ్యులు నయీంపాషా, గణేష్, సాదిక్ ఆలీ, వెంకన్న, నాయకులు శ్రీకాంత్, కృష్ణార్జునరావు, జి మల్లయ్య, సత్యనారాయణ, జిల్లా కోశాధికారి భాస్కర్, రాఘవేంద్ర పాల్గొన్నారు.

కవులకు శ్రామిక విశిష్ట పురస్కారాలు

ఖమ్మంగాంధీచౌక్: మేడే పురస్కరించుకొని వికాస సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఖమ్మం నగరంలోని బైపాస్ రోడ్డులో కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రామికులైన కవులు నల్ల కృష్ణ, రేళ్ల శ్రీనివాస్, గుమ్మడి పుల్లయ్య, మందుల వీరభద్రం, గరిడేపల్లి శోభనాద్రి, నామవరపు కాంతేశ్వరరావులను మేడే విశిష్ట పురస్కారాలతో సత్కరించారు. వికాస వేదిక కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగు నర్సింహారావు మాట్లాడగా మోదుగు గోవిందు, జయవాసు, శంకర్ రెడ్డి, శ్రీనివాసరావు, సునీత, రెంటాల చిన్న హుస్సేన్, శైలజ, వసంత కవితాగానం చేశారు.

అక్రమాలకు పాల్పడిన వారిపై చర్య తీసుకోవాలి

ఖమ్మం మామిళ్లగూడెం: దళితబంధు అక్రమాలకు పాల్పడిన ఎమ్మెల్యేలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఆదివారం జెడ్పీ సెంటర్ అంబేద్కర్ విగ్రహం ఎదుట ధర్నా చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, బచ్చలకూరి వెంకటేశ్వర్లు, అంజయ్య, రాము, జనార్దన్, శ్రీను, సైదులు, శ్రీనివాస్, నరసింహరావు, వెంకటేశ్వర్లు, జానకి రాములు, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కాటి కాపరులకు వితరణ

ఖమ్మం మామిళ్లగూడెం: కార్పొరేటర్ ముక్కల కమల తనయుడు రాజేష్ తాత ముక్కల రామయ్య జ్ఞాపకార్థం కాటికాపరి జాంబవంతుడు సొసైటీ, హిందూ శ్మశాన వాటిక ప్రధాన కార్యదర్శి చెరుకు మల్లి బాబుకు పదివేల రూపాయలు వితరణగా ఆదివారం అందజేశారు. పంది వేణు, కొలిక పాంగు సైదులు, కాశయ్య, పడిశాల వీరస్వామి, గట్టికొండ చుక్కయ్య, ఏపూరి తరుణ్ పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న దృశ్యం

మంత్రులను కలిసిన నాయకులు



మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న టీఎన్జీవోస్ నాయకులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్ర సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లో పలువురు మంత్రులు, ఉన్నతాధికారులను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు అఫ్జల్‌హసన్ ఆధ్వర్యంలో కలిశారు. రాష్ట్ర ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పర్యాటక శాఖామంత్రి శ్రీనివాస్ గౌడ్, రవాణాశాఖామంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, పార్థసారథి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, రాములు నాయక్, స్పోర్ట్స్ డైరెక్టర్ వాసం వెంకటేశ్వరరావు, కలెక్టర్ వీపీ గౌతమ్, టీఎన్జీవోస్ కేంద్ర సంఘం నాయకులు మామిళ్ల రాజేందర్, మారం జగదీష్‌లకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంబూరు సునీల్‌రెడ్డి, దొడ్డె పుల్లయ్యలు సైతం పలువురిని కలిసి పుష్పగుచ్ఛాలు అందించారు. ఈ కార్యక్రమాల్లో టీఎన్జీవోస్ రాష్ట్ర ఆర్గనైజింగ్ నందగిరి శ్రీను, డి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరిస్తాం

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తమ వంతుగా కృషి చేస్తామని తెలంగాణ ప్రభుత్వ డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షులు ఎండి.అబ్దుల్ హకీం, హౌస్ బిల్డింగ్ సొసైటీ చైర్మన్ ఎండి.సలీంలు అన్నారు. ఆదివారం నగరంలోని డ్రైవర్ల సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆగస్టు 30లోపు సభ్యత్వాలు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి గంగన్న, వేణుగోపాల్, రామారావు, నర్సింహరావు, రాములు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న కమిటీ సభ్యులు, భక్తులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 13వ డివిజన్ శ్రీశ్రీ సర్కిల్‌లోని 7వ డివిజన్ టేకులపల్లి భక్త ఆంజనేయస్వామి దేవస్థానంకు చెందిన స్థలంలో ఆదివారం 108 అడుగుల పంచముఖ ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటుకు ఆదివారం శంకుస్థాపన చేశారు. సుమారు 20 అడుగుల లోతులో పునాది తవ్వి అక్కడ అర్చకుల బృందం వేద మంత్రాలు, ప్రత్యేక పూజలతో శంకుస్థాపన చేశారు. విగ్రహంతోపాటు రామమందిరం, శ్రీకృష్ణుడు దేవాలయాలు సైతం నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొందిలి నాగారాం సింగ్ కుటుంబ సభ్యులతోపాటు టేకులపల్లి దేవాలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలోపాల్గొన్నారు.

ముగిసిన వీరన్నస్వామి జాతర



పూజలు నిర్వహిస్తున్న షర్మిల

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురం గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న శ్రీ వీరన్నస్వామి జాతర ఆదివారంతో ముగిసింది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆమె వెంట రాష్ట్ర అధికారి ప్రతినిధి, ఖమ్మం ఉమ్మడి జిల్లా పరిశీలకులు పిట్ట రామిరెడ్డి, రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షుడు నీలం రమేష్, వ్యక్తిగత సహాయకులు నంద్యాల రవీందర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు గుగులోత్ రూప్లానాయక్, డివిజన్ అధికార ప్రతినిధి సైదులు, నంబూరి ప్రసాద్, రావెళ్ల కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు. జాతర ముగింపు సందర్భంగా కమిటీ సభ్యులు భక్తులకు ఎలాంటి ఆటంకాలు లేకుండా ఏర్పాట్లు చేశారు. జాతరను విజయవంతం చేసినందుకు కమిటీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశ్రీ సాహిత్యంతో చైతన్య స్ఫూర్తి



నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

ఖమ్మంగాంధీచౌక్: మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు(శ్రీశ్రీ) సాహిత్యం సమాజంలో చైతన్య స్ఫూర్తిని నింపిందని వికాసవేదిక సాహిత్య సంస్థ అధ్యక్షుడు బుక్కా సత్యనారాయణ అన్నారు. మహాకవి శ్రీశ్రీ జయంతిని పురస్కరించుకొని ఆదివారం ఖమ్మం నగరంలోని ఆయన విగ్రహానికి వికాస సాహిత్య వేదిక ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికాస వేదిక ప్రధాన కార్యదర్శి లెనిన్ శ్రీనివాస్, నామవరపు కాంతేశ్వరరావు, రేళ్ల శ్రీనివాస్, మలిశెట్టి కృష్ణమూర్తి, నల్ల కృష్ణ, గాజుల భారతీ శ్రీనివాస్, శైలజా శ్రీనివాస్, కొత్త శకర్ రెడ్డి కవితలను, పాటలను ఆలపించారు. కవులు, సాహితీవేత్తలు చిన్న హుస్సేన్, జయవాసు, శోభనాద్రి, వీరభద్రం, పుల్లయ్య పాల్గొన్నారు.

అక్షరంతో సమాజ గతిని మార్చిన శ్రీశ్రీ

సమాజంలో అన్ని రంగాలను ప్రభావితం చేసిన కవిత్వం శ్రీశ్రీదని సాహితీవేత్తలు తెలిపారు. శ్రీశ్రీ జయంతి సందర్భంగా నగరంలోని శ్రీ శ్రీ విగ్రహానికి కవులు, రచయితలు, కళాకారులు, సాహితీవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవిమారుత్, ఐవి రమణ, చల్లా శేషగిరి, అట్లూరి వెంకటరమణ, వురిమళ్ల సునంద, ఇబ్రహీం, నిర్గుణ్, జాషువా సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి పగిడిపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

భట్టి యాత్రకు సంఘీభావం

ఖమ్మం సహకారనగర్: సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క నిర్వహిస్తున్న పీపుల్స్ మార్చ్ యాత్రకు 50మంది ముఖ్య నాయకులు, పలువురు కార్పొరేటర్లు సంఘీభావం తెలిపినట్లు కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్ తెలిపారు. ఇప్పటికే 15 నియోజకవర్గాల్లో యాత్ర సాగిందన్నారు. నాయకులు మలీదు వెంకటేశ్వర్లు, సైదులు, భారతిచంద్రం, బాలాజీ నాయక్, బాతుల రమణ, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నేలకొండపల్లి: భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో నేలకొండపల్లికి చెందిన యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్రిపోతుల అంజిని భట్టితో పాటు పాదయాత్ర చేశారు. ఆదివారం నాటికి 500 కిలో మీటర్ల మైలు రాయి దాటిన సందర్భంగా అంజిని మాట్లాడారు.

వాసవి అమ్మవారి జయంతి

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ అమ్మవారి జయంతి వేడుకలను ఆదివారం నగరంలో భక్తులు వైభవంగా జరుపుకున్నారు. నగరంలోని త్రీటౌన్ గుట్టల బజార్, ట్రంక్ రోడ్‌లో ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయాల్లో అమ్మవారి జయంతి వేడుకలను ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గుట్టల బజార్‌లో దేవాలయ కమిటీ అధ్యక్షులు మేళ్లచెర్వు వెంకటేశ్వరరావు దంపతులు పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి దేవత అనిల్, కోశాధికారి కొత్తమాసు హేమసుందర్‌రావు పాల్గొన్నారు. ట్రంక్ రోడ్డు ఆలయంలో ఆలయ కమిటీ చైర్మన్ యర్రం బాలగంగాధర్ తిలక్ ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

మేడేను ఘనంగా నిర్వహించాలి

ఖమ్మం సహకారనగర్: మేడే వేడుకలను జయప్రదం చేయాలని ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్తా సీతారాములు పిలుపునిచ్చారు. ఆదివారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సన్నాహాక సమావేశాన్ని నిర్వహించారు. నాయకులు స్వర్ణలత, విప్లవ్ కుమార్, రమేష్, గోపి, ఉపేందర్, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యం.. రైతుల పరుగులు



కూసుమంచి: పట్టాలపై నిలిచిన వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు



నేలకొండపల్లి: రహదారి వెంట తడిసిన ధాన్యం

నేలకొండపల్లి/కూసుమంచి: రైతులు పండించిన పంటలు వర్షార్పాణం అవుతున్నాయి. రహదారి వెంట ఆరబెట్టిన ధాన్యం ఆదివారం కురిసిన వర్షంకు తడిసిపోయాయి. ధాన్యంను కాపాడుకునేందుకు టార్పాలిన్ల కోసం పరుగులు తీశారు. కనీసం ప్రభుత్వం టార్పాలిన్లు అయినా అందించాలని రైతులు కోరుతున్నారు. త్వరితగతిన కొనుగోళ్లు చేపట్టి తమ కష్టాలు తీర్చాలని వేడుకుంటున్నారు.